

మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, ఎంపీపీ రజితారాజమల్లారెడ్డి తదితరులు



మున్సిపాలిటీ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ దీపికానర్సింహా రెడ్డి

# మహిళా సంక్షేమానికి కృషి చేసింది కేసీఆరే..

**కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీచేసిన జడ్పీ చైర్మన్**

**మేడ్చల్, డిసెంబరు 16:** మేడ్చల్ మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి చెక్కులను జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి ఎంపీపీ రజితారాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజావిజయానందారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోపని వెంకటేశం, డబిల్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ సురేశ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కుమార్ యాదవ్, గౌడవెల్లి సర్పంచ్ సురేం ద ముదిరాజ్,ఎంపీడీవో పద్మావతియ తదితరులు పాల్గొన్నారు. కాగా మేడ్చల్ మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి ఆధ్వర్యంలో 29 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే మల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఎంతో మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ చెక్కులు అందేందుకు కృషి చేశారన్నారు. ఆయన సేవానిరతిని గుర్తించి, మరోమారు ఎమ్మెల్యేగా ఎన్నుకున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సంక్షేమం, సాధికారిత కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘతన కేసీఆర్‌ది, బీఆర్ఎస్ ప్రభుత్వానిదని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్వో శైలజ, కౌన్సిలర్లు గణేశ్, నర్సింహస్వామి, శ్రీనివాస్ రెడ్డి, మహేశ్, కో ఆప్షన్ సభ్యులు గీత, నవీన్‌రెడ్డి, మహబూబ్ అలీ, నాయకులు నర్సింహారెడ్డి, శేఖర్ గౌడ్, శ్రావణ్‌కుమార్, మల్లేశ్ గౌడ్, రవీందర్, నాగరాజు, నరేందర్, రఫి, డీఈ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్‌లో నేడు ఎమ్మెల్యే పర్యటన

**ఘట్‌కేసర్,డిసెంబర్16:** ఈనెల 17న మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఘట్‌కేసర్‌కు రానున్నట్లు మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్ తెలిపారు.ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేయనున్న ఏకవీర కన్సల్టెన్సీ కార్యాలయం ప్రారంభోత్సవానిక మల్లారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.మొట్టమొదటి సారిగా ఘట్‌కేసర్‌కు వస్తున్న ఎమ్మెల్యేకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలుకనున్నట్లు వివరించారు. మున్సిపాలిటీ కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని చైర్‌పర్సన్ కోరారు.

## ప్రతి సోమవారం ప్రజాదర్బార్

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16:** ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా దర్బార్‌ను నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయ మాట్లాడుతూ మండల పరిధిలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు గాను ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు పెట్టుకున్న అర్జీలకు అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## థియేటర్ ఆర్ట్స్ బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

**మేడ్చల్, డిసెంబరు 16:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో థియేటర్ ఆర్ట్స్ బోధించుకు మాస్టర్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్(ఎంపీఏ) విద్యార్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గురుకుల పాఠశాలల రీజినల్ కో ఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు rcyddmalkaj-giri<\@>gmail.com కి తమ బయోడేటాను పంపించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియను ఈనెల 21వ తేదీన ఎదులాబాద్‌లో కృష్ణమూర్తి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.34వేల గౌరవ వేతనం ఉంటుందని తెలిపారు.

## యువకుడి మృతదేహం లభ్యం

**పీర్జాదిగూడ, డిసెంబర్17:** గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధి శోలేబార్ సమీపంలో శనివారం ఉదయం గుర్తుతెలియని యువకుడి మృతదేహం స్థానికులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం వివరాలను సేకరించారు. అతిగా మద్యం తాగి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. మృతిడికి సుమారు 25-30 వయస్సు ఉంటుందని,పసుపు రంగు టీ షర్టు, క్రీం కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, కుడి చేతి పైన ఓం గుర్తు పచ్చబొట్టు, రెండు చేతులకు రబ్బర్‌బ్యాండ్ ధరించాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. మృతిడి వివరాలు తెలిసిన వారు మేడిపల్లి పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## ఎయిర్‌ఫోర్స్ అకాడమీ సందర్శన



ఎయిర్‌ఫోర్స్ అకాడమీని సందర్శించిన ఎన్‌సీసీ క్యాడెట్లు

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16:** ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీని అనురాగ్ ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం సందర్శించారు. మండల పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ అధికారి డాక్టర్ సి మల్లేశ్ ఆధ్వర్యంలో 24 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు దుండిగల్‌లోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ పాసింగ్ అవుట్ పరేడ్ ఆఫీసర్స్ కోర్స్ కోసం సందర్శించి పలు విషయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ఈ సందర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారి తెలిపారు.

## ఘనపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి



చెంగిచెర్ల డిపో అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ గోపాల్ రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16:** ఘనపూర్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ సర్పంచ్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో చెంగిచెర్ల డిపో మేనేజర్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. మండల పరిధి ఘనపూర్ గ్రామానికి గతంలో ఉన్న బస్సు సౌకర్యాన్ని రద్దు చేశారని దీంతో గ్రామస్తులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. రద్దు చేసిన బస్సును వెంటనే పునరుద్ధరించాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మేడ్చల్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, మాజీ సర్పంచ్ రూప్‌సింగ్ నాయక్, సురేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

**కీసర, డిసెంబర్ 16:** కీసరలోని శ్రీ హరిహరి పుత్ర వరాల అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుతున్నాయి. శనివారం వేదపండితులు వెంపటి సాయికిరణ్‌శర్మ, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్ప భక్తమండలి కమిటీ అధ్యక్షులు బాల్‌రెడ్డి గురుస్వామిల ఆధ్వర్యంలో భక్తులు హోమాలు నిర్వహించారు. వేదపండితులు ఆలయంలో గోపూజ, ఆవాహిత దేవత తదితర ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం మాజీ ఎంపీటీసీ రమేశ్‌గుప్త ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ఆదివారం ఆలయంలో ఉదయం 6.45గంటలకు అయ్యప్ప స్వామి వారి యంత్ర విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## గంజాయి తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

**ఘట్‌కేసర్ రూరల్,డిసెంబర్ 16:** గంజాయిని తరలిస్తున్న మహిళలతో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసి రూ.12లక్షల విలువైన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీ స్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ భరత్‌భూషన్ వివరాలు వెల్లడించారు.చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేస్తుండగా రైల్వే స్టేషన్ నుంచి బీహార్ రాష్ట్రం ముజాల్దర్‌పూర్‌కు చెందిన అమ్రిత కుమారి, ఢిల్లీకి చెందిన మంజుశర్మ,మహారాష్ట్ర కొల్హాపూర్‌కు చెందిన రవీంద్ర బిప్రచంద్ ఐదు బ్యాగులతో బయటకు వస్తుండగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 42కిలోల ఎండు గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా విశాఖపట్నం నుంచి తక్కువ ధరకు తీసుకువచ్చి చర్లపల్లి పారిశ్రామికవాడల్లో ఎక్కువ ధరకు గంజాయిని అమ్ముతున్నట్లు చెప్పారు.నిషేధిత గంజాయిని తరలిస్తూ పట్టుబడిన నిందితులను రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.కార్యక్రమంలో టాస్ట్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మోహన్ బాబు, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, ఎస్సైలు పురుశోత్తంరెడ్డి,ధన్‌రాజ్, శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.

## రజకుల ఇండ్లను కూల్చడం అన్యాయం

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 16:** ప్రతాపసింగారంలో రజకులు తమ సొంత స్థలంలో ఇండ్లు నిర్మించుకుంటే కూల్చివేయడం దారుణమని మండల రజక సంఘం అధ్యక్షుడు అబ్బోళ్ల నాగేశ్ విమర్శించారు. ప్రతాపసింగారం గ్రామంలోని సర్వే నంబర్ 378లో అదే గ్రామానికి చెందిన రజకులు తమ సొంత భూమిలో ఇండ్లునిర్మించుకోగా స్థానిక కాంగ్రెస్ నాయకులు అధికారులపై వత్తిడి తీసుకువచ్చి కూల్చివేయించారని ఆరోపించారు. శనివారం కూల్చివేతలు జరిపిన స్థలంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు చూపుతు రజకులు నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులు ఎలాంటి విచారణ జరుపకుండానే కూల్చివేతలు జరిపినట్లు ఆరోపించారు. కూల్చివేతలు జరిపిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల రజక సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## మౌలిక వసతులకు ప్రాధాన్యం



డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

**బోడుప్పల్, డిసెంబర్16:** బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో మౌలికవసతులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం 26వ డివిజన్ పరిధి వీరారెడ్డి కాలనీలో రూ.14లక్షల నిధులతో నిర్మించనున్న భూగర్భడ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ శోభారాణితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సీనియర్ సిటిజన్స్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లతో..ఆహ్లాదాన్ని పంచేలా సుందరీకరణ



అధికారులతో కలిసి పార్కు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న మేయర్ కావ్య

**జవహర్‌నగర్, డిసెంబర్ 16:** పచ్చని చెట్లతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా పార్కును సుందరంగా తీర్చిదిద్దుతు న్నామని మేయర్ మేకల కావ్య అన్నారు. హెచ్ఎండీఏ ప్రత్యేక నిధులు రూ. 40లక్షలతో చెన్నాపురంలోని పట్టణ ప్రకృతి వనంలో పార్కు సుందరీకరణ ఏర్పాటు పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ రామలింగంతో కలిసి మేయర్ కావ్య పరిశీలించారు.కార్యక్రమంలో డీఈఈ మాధవచారి, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సందీప్, శానిటరీ సూపర్‌వైజర్ కృష్ణప్ప, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వీధికుక్కల నియంత్రణకు చర్యలు

**ఘట్‌కేసర్,డిసెంబర్16:** పోచారం మున్సిపాలిటీలో వీధికుక్కల నియంత్రణ కు చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ బి.కొండల్‌రెడ్డి తెలిపారు.శనివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ,లక్ష్మీనర్సింహ కాలనీ,సాయినగర్,సత్యసాయినగర్‌లో బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధులతో కలిసి మున్సిపాలిటీ సిబ్బంది వీధి కుక్కలను గుర్తించి పట్టుకొని సంరక్షణ కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రెడ్డ్యానాయక్,కౌన్సిలర్ రాజశేఖర్,బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధులు ప్రవళిక, కుమారి సిబ్బంది పాల్గొన్నారు.



అన్నోజిగూడలో వీధికుక్కలను పట్టుకున్న బ్లూక్రాస్ సంస్థ ప్రతినిధులు


